క్లుప్తంగా

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న బీటీఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్

ఆదోని సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీని ప్రకటించాలని బీటీఏ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఒకవేళ కమిషన్ ఏర్పాటు ఆలస్యమయ్యే పక్షంలో ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జయరాం, చంద్రశేఖర్, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు ప్రభావంతో యువరైతుకు అస్వస్థత

కోసిగి: మండల పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన ఎం.ఆంజనేయులు అనే యువరైతు పొలంలో మందు పిచికారీ చేస్తూ అస్వస్థకు గురయ్యాడు. ఆదివారం ఉదయం తన బావ పొలంలో టిమెట్ మందును పిచికారీ చేస్తుండగా ఎదురు గాలికి నోటికి, ముక్కులోపలికి మందు వెళ్లడంతో అస్వస్థతకు గురై పొలంలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోనిలో ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు.

భక్తురాలికి అస్వస్థత



అస్వస్థతకు గురైన భక్తురాలు సర్వమ్మ

మంత్రాలయం రూరల్ : రాఘవేంద్రస్వామి మఠం దర్శనార్థం వచ్చిన ఓ భక్తురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది. బెంగళూరులోని తుముకూరు ప్రాంతానికి చెందిన సర్వమ్మ ఉదయం స్వామి దర్శనార్థం శ్రీమఠానికి వచ్చింది. అక్కడ స్వామి దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా ప్రధాన ముఖద్వారం వద్ద స్పృహ కోల్పోయింది. ఉన్నపాటున కుప్పకూలి పోవడంతో బంధువులు ఆందోళనకు గురయ్యారు. భక్తుల రద్దీతోపాటు ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆమె అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. శ్రీమఠం భక్తులకు వసతులు అరకొరగా ఉండటంతో ఈ పరిస్థితి దాపురిస్తోంది. భక్తులకు దాహం తీర్చుకోవడానికి కూడా నీటి సదుపాయం క్యూలైన్ల దగ్గర్లో లేవు. అంతేగాక భక్తులకు రద్దీ అనుగుణంగా శ్రీమఠం ప్రాంగణంలోనే అంబులెన్స్ అందుబాటులో ఉంచాల్సి ఉంది. అయితే సర్వమ్మ స్పృహ కోల్పోయి అరగంట గడిచినా అంబులెన్స్ రాలేకపోవడంతో సర్వమ్మ బంధువుల అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీమఠం అధికారులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

గో సంరక్షణకు విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద గో సంరక్షణ కోసం ఆదివారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. జోహారాపురం వాస్తవ్యులైన దూదెకొండ సీతారాంరెడ్డి వారి కుంటుంబ సభ్యులు రూ.30వేలు అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు విరివిగా విరాళాలు అందజేయాలని డిప్యూటీ కమిషనర్ కోరారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ఎమ్మిగనూరురూరల్: ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆశ వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి శివలక్ష్మి, సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా వైద్య రంగంలో పనిచేస్తున్న మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు రూ. 26 వేలు వేతనం చెల్లించాలని చెప్పారు. ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఆశా వర్కర్ల సంఘం నాయకురాళ్లు మంజుల, సుమిత్ర, రబియా, పద్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బిందెడు నీటి కోసం
పుట్టెడు కష్టాలు.!

- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ఆరు గ్రామాల ప్రజలు
- రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా
- ఏనుగుబాలలో జలజీవన్ మిషన్ కుళాయిలకు రాజకీయ గ్రహణం
- అధికార పార్టీ నాయకుల మనస్పర్థలతో ఉపయోగంలోకి రాని వైనం



నీటి బిందెలను తోపుడు బండిపై తీసుకెళ్తున్న మహిళ



గార్లదిన్నెలో బిందెలతో నీటి కోసం కుళాయి వద్ద గుమిగూడిన ప్రజలు

ఎమ్మిగనూరురూరల్: వేసవి వచ్చిందంటే ఆ గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. బిందె నీటి కోసం కుళాయిల వద్ద గొడవలు.. బిందెలతో పడిగాపులు నిత్యకృత్యం. రెండు, మూడు రోజులకు ఒక సారి వచ్చే కుళాయి నీటి కోసం గ్రామీణులు ఎదురుచూడాల్సిన పరిస్థితి. కుళాయి నీటి కోసం కూలీ, పొలం, ఇంటి పనులు మానుకొని వేచిచూడాల్సి వస్తోంది. అధికారులు నీటి సమస్య రాకుండా చూస్తాం.. చేస్తాం..అంటున్నారే తప్పా పరిష్కారం మాత్రం చూపలేకపోతున్నారు. తాగునీటి కోసం మండలంలోని ఆరు గ్రామాలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

నీటికోసం బిందెలతో పడిగాపులు

అల్వాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి ఎమ్మిగనూరు మండలం దైవందిన్నె, గార్లదిన్నె, పెసలదిన్నె, ఏనుగుబాల, నందవరం మండలం పొనకలదిన్నె, గోనెగండ్ల, అల్వాల గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. అయితే రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తుండటంతో మండలంలోని దైవందిన్నె, గార్లదిన్నె, పెసలదిన్నె, ఏనుగుబాల గ్రామాల ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. పనులన్నీ మానేసి బిందె నీటి కోసం పడిగాపులు కాస్తున్నారు. కుళాయిల దగ్గర వందల సంఖ్యలో బిందెలను క్యూలో ఉంచి వేచిచూడాల్సిన దుస్థితి. కుళాయి నీరు రాని రోజు పొలాల్లో ఉండే బోరు బావుల వద్ద నీటిని తెచ్చుకొని కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామాల్లో ఉండే బోరునీరు వాడుకోవటానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి.

అధికార పార్టీ నాయకుల మనస్పర్థలతో నిరుయోగంగా కుళాయిలు

ఏనుగుబాల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన 280 కుళాయిలకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. వేసవి నీటి ఎద్దడిని నివారించుకునే అవకాశం ఉన్నా గ్రామంలోని అధికార పార్టీ నాయకులు కుళాయిలకు నీటి సరఫరా చేయకుండా నిలిపివేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన వారి మధ్య మనస్పర్థల కారణంగా కుళాయిలను ఉపయోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా నిరూపయోగంగా మారిపోయి దిష్టిబొమ్మల్లా దర్శనం ఇస్తున్నాయి. అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన కుళాయిలకు నీటి సరఫరా జరుగుతున్నా, ఏనుగుబాలలో మాత్రం నిలిచిపోవటం ఆశ్చర్యం కలిగిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఏనుగుబాలలో నిరూపయోగంగా మారిన జలజీవన్ మిషన్ కుళాయిలు

తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి



గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అవసరం ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులకు ఉంది. రెండు రోజులకు ఒకసారి వచ్చే తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. ఒక బిందె నీరు దొరికితే మరో బిందెకు వంతు వచ్చేలోపు కుళాయిలు బంద్ అవుతున్నాయి. ఓట్లు మాత్రం వేయటానికేనా మేము పనికివచ్చేది, మా గ్రామ తాగునీటి సమస్య ప్రజాప్రతినిధులకు కనిపించదా ?.

– తిమ్మగురుడు, గార్లదిన్నె, ఎమ్మిగనూరు

నీటి సమస్య రాకుండా చర్యలు



గామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటాం. ఈ గ్రామాల్లో కుళాయిల నీరు రానిరోజు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఏనుగుబాల గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన కుళాయిలు వాడుకలో లేవు. ప్రజాప్రతినిధులు, పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని ఉపయోగంలోకి తీసుకువస్తాం. గ్రామాల్లో నీటి సమస్య ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – ప్రవీణ్‌కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎమ్మిగనూరు

నీటి సమస్యను పరిష్కరించండి



పాదయాత్రలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: మండలంలోని గ్రామాలకు నిధులను కేటాయించి శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11, 12, 13వ తేదీల్లో సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్ల కావొస్తున్నా తాగడానికి మంచినీరు కావాలని అడగడం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరికోసం పనిచేస్తున్నాయని వారు విమర్శించారు. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకులు, పైపులైన్లు ఇప్పుడున్న జనాభాకు అనుగుణంగా నీరు అందించడంలో పూర్తిగా విఫలమవుతున్నాయన్నారు. పాదయాత్ర పెద్దతుంబళం నుంచి ప్రారంభమై నెట్టేకల్ వరకు కొనసాగుతుందన్నారు. మూడు రోజులపాటు 80 కి.మీ. 22గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి ఈనెల 14న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం ఎదుట మహాధర్నాతో ముగుస్తుందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లింగన్న, కృష్ణమూర్తి, వీరారెడ్డి, పాండగల్ సర్పంచ్ కె.ఉమాదేవి, అయ్యప్ప, హనుమంత రెడ్డి, పాండురంగ, అయ్యన్న, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త బసవన్న



మాట్లాడుతున్న సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్

ఎమ్మిగనూరురూరల్: సమాజంలో కులం లేదు, మతం లేదు మానవత్వమే సమాజానికి జీవనాధారమని చెప్పిన గొప్ప సంఘసంస్కర్త బసవన్న అని సాహితి స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక గుడ్‌సెఫర్డ్ స్కూల్లో జిల్లా కమిటీ సమావేశం సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు ఆవుల బసప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఆదోనిలో విశ్వగురు బసవన్న సాహిత్యంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలనుకున్నామని చెప్పారు. 12వ శతాబ్దంలోనే కార్మిక వర్గం నా ఆస్తిత్వం అంటూ ప్రకటించిన గొప్ప మహోన్నతుడు బసవన్న అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతి సభలకు సంబంధించిన జాబితాను విడుదల చేసిందని, ఈ జాబితాలో గుర్రం జాషువా, గురుజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పేర్లు ప్రకటించకపోవటం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే జాబిత సవరణ చేసి వీరిపేర్లతో మరలా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అవుల చక్రపాణియాదవ్, జిల్లా నాయకులు నాగమణి, పార్వతమ్మ, పులిచేరీ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికుడి త్యాగం దేశం మరిచిపోదు





మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, నాయకులు

ఎమ్మిగనూరులో భారత సైన్యానికి సంఘీభావంగా నినాదాలు చేస్తున్న బుట్టా నీలకంఠ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కౌతాళం: వీర సైనికుడి త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరిచిపోదని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. కౌతాళంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జయహో మురళీ నాయక్ అంటూ నినాదాలు చేశారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖవద్ద విధులు నిర్వహిస్తున్న తెలుగు ముద్దబిడ్డ మురళీ నాయక్ వీరమరణం పొందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట సర్పంచ్ పాల్‌దినకర్, మండల కన్వీనర్ ప్రహల్లదచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, వైస్ సర్పంచ్ తిక్కయ్య, పొదలకుంట ఎంపీటీసీ మూకన్న, నాయకులు అబ్దుల్ సమద్, వడ్డెరాము, ఇద్రూస్, తాహెర్, వెంకటరామిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

పరామర్శ

ఆరోగ్యం బాగ లేక ఇటీవల ఆపరేషన్ చేసుకున్న నర్సారెడ్డి, ఆనంద్ ఇళ్ల వెళ్లి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ఆడిగి తెలుసుకుని వారికి ధైర్యం ఇచ్చారు.

భారత సైన్యానికి సంఘీభావం

ఎమ్మిగనూరురూరల్: ఉగ్రవాదులను ముట్టుబెట్టిన భారత సైన్యానికి సంఘీభావంగా ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ ఆధ్వర్యంలో వైఎస్సార్ సర్కిల్లో భారత సైనికులకు చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ ఉగ్రవాదులను ముట్టబెట్టుటలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరు మహిళా అధికారులను ధైర్యసాహసాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అమహ్మద్, రాష్ట్ర మేథావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కెఆర్. లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు ఎంకె. శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు నివాళి



జవాన్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు : దేశం కోసం పోరాడుతూ వీర మరణం పొందిన జవాను మురళీనాయక్ దేశ ప్రజల గుండెల్లో అమరుడిగా మిగిలిపోయాడని, ఆయన దేశం కోసం చేసిన త్యాగం ఎన్నటికీ మరవలేమని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మురళీ నాయక్ ధైర్యసాహసాలు రేపటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసులు, సేదు నాగరాజు, ఓకే ఈరన్న, రాముడుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



ఆదోని ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుడి బ్యాగును తనిఖీ చేస్తున్న సీఐ, పోలీసులు



కోసిగి బస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి

ఆదోని టౌన్: భారత్-పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆదోనిలో ఆదివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లు, జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో సీఐ రామలింగమయ్య, ఏఎస్ఐ శివరాముడు ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారినైనా వదిలే ప్రసక్తేలేదని చెప్పారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తున్నట్లయితే తమకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ రాజశేఖర్‌తో పాటు పోలీసు సిబ్బంది చిన్నికృష్ణుడు, పోలీసులు పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పలు పబ్లిక్ ప్రదేశాలలో అనుమానితుల బ్యాగులు, ప్యాకెట్లు, వాహనాలను సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో కోసిగి ఆంజనేయ స్వామి



రథోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ మంజునాథ్, ఆలయ అధికారులు

కోసిగి: మండల కేంద్రం కోసిగి ప్రజల ఆరాధ్య దైవం కడపాళెం వీధిలో వెలసిన శ్రీ కోసిగయ్య (ఆంజనేయ) స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ్య మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం వేకువ జామున నుంచి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు గోపాల్ స్వామి ఆయన కుమారుడు ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతులు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ధర్మకర్త శ్రీనివాస రాజు దొర, మురళీ దొర ఆధ్వర్యంలో వేదపండితులు జయతీర్థ ఆచార్, రఘునందన్ ఆచార్‌ల నేతృత్వంలో సీతారాముల వారికి ముత్యాల పందిరి వేసి వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణ తంతు జరిపించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా ఆలయం చెంత నుంచి తేరుబజారు మైదానం వరకు తీసుకెళ్లారు. ఉత్సవమూర్తులను ప్రభపై ఆశీనులుగావించారు. అక్కడ హారతులు పట్టి ప్రభోత్సవాన్ని స్వామి వారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథా స్థానానికి చేర్చారు. కార్యక్రమంలోభక్తాదులు పాల్గొన్నారు.

నేడు మహా రథోత్సవం

నేడు వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని తేరు బజారు మైదానంలో సంప్రదాయ బద్ధంగా సాయంత్రం స్వామి వారి మహా రథోత్సవం నిర్వహించనున్నారు. రథోత్సవానికి ఇటీవల కొత్తగా వివాహం అయిన పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలు పెళ్లి రోజు నాటి దుస్తులు ధరించి రథోత్సవంలో పాల్గొనడం ఆనవాయితీ.

కేసు నమోదు

ఆదోని రూరల్: మండలంలోని కుప్పగల్ గ్రామంలో ప్రజలకు తాగునీటిని అందించే నీటి పైపులైన్‌ను గోపాల్ అనే వ్యక్తి ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేసినట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దర్గా అభివృద్ధికి కృషి



దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఖాదర్‌లింగ స్వామి దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఉరుసు సందర్భంగా దర్గాకు మండల నాయకులతో కలిసి తరలివచ్చి ప్రత్యేకంగా తెచ్చిన చాదర్‌ను, పూలను సమర్పించారు. ఎమ్మెల్యేకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ స్వాగతం పలికి దర్గా సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు చేయించి, పూలమాల శాలువలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందు ముస్లింల సమైక్యతకు సంఘీభావంగా ఉన్న ఖాదర్‌లింగ స్వామి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికి ఉండాలన్నారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆయన వెంట కౌతాళం మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు వడ్డెరాము, తాహెర్, ఇద్రుస్, పలువురు పాల్గొన్నారు.

నరసింహస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే

మంత్రాలయం రూరల్ : నరసింహ స్వామి జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి నరసింహ స్వామి ఆరాధనలో గడిపారు. ఆదివారం మండలంలోని మాధవరం గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి అభిషేకాలు గావించి ప్రత్యేక పూజోత్సవాలు నిర్వహించారు. వేడుక సందర్భంగా ఎమ్మెల్యే, పాలక మండలి మాజీ సభ్యులు ఆలయంలో స్వామి దర్శనం చేసుకుని పూజలు చేసుకున్నారు. వేడుక సందర్భంగా గ్రామస్తులు పిండివంటలు చేసుకుని నైవేద్యాలు సమర్పించారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆలూరు రూరల్: కారు స్కూటర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఆలూరు సమీపంలోని కర్నూలు–ఆదోని క్రాస్ రోడ్డులో ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు.. మండలంలోని హులేబీడు గ్రామానికి చెందిన నరసప్ప, చిన్న ఈరన్న, పరుశురాం దేవర ఉత్సవాలకు బంధువులను ఆహ్వానించడానికి ఆలూరుకు వచ్చి అక్కడ నుంచి ఆస్పరికి స్కూటర్‌పై వెళ్తున్నారు. హైవే- 167లోని కర్నూలు–ఆదోని క్రాస్ రోడ్డ వద్ద మంత్రాలయం నుంచి ఆలూరు వైపునకు వస్తున్న కారు (కేఏ 50 ఎండీ 6017) స్కూటర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో చిన్న ఈరన్న, నరసప్ప తలకు తీవ్రగాయాలయ్యాయి. పరుశురాం స్వల్పంగా గాయపడ్డారు. ప్రయాణికులు గమనించి క్షతగాత్రులను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దేవరగట్టులో పూజలు

హొళగుంద: దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామికి భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామి వారాన్ని పురస్కరించుకుని ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి, ఆకుపూజ, నివేదన, నిరాజనం తదితర పూజలు చేపట్టి చివరగా నైవేద్యం సమర్పించారు.

వైభవంగా చర్చి ప్రతిష్ట మహోత్సవం





పెద్దనేలటూర్‌లో నూతనంగా నిర్మించిన ఏబీఎం చర్చి, ప్రార్థనలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దనేలటూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఏబీఎం చర్చి ప్రతిష్ట మహోత్సవాన్ని క్రైస్తవులు వైభవంగా నిర్వహించారు. ఈ చర్చి ప్రతిష్ట వేడుకలను స్థానిక సంఘ కాపరులు, సంఘ పెద్దలు, సంఘ కార్యవర్గం అధ్యక్షతన ఎస్. జయకాంత్, డాక్టర్ ఆర్.డి. సజీవ రాజులచే ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. మూడు రోజులుగా చర్చిలో గీతారాధనలు, ప్రార్థనలు, దేవుని సందేశాలు వినిపించారు. ప్రతిష్ట వేడుకలకు గ్రామస్తులే కాక వివిధ గ్రామాల క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చర్చి ప్రతిష్ట వేడుకలకు ఆదివారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి హాజరయ్యారు. చర్చిలో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆక్టివిటీ కార్యదర్శి బండెనవాజ్, మండల కన్వనర్లు కేవీ కృష్ణారెడ్డి, రావూఫ్‌లను సంఘస్తులు శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శివారెడ్డి గౌడ్, సర్పంచ్ సోమన్న, నాయకులు జహంగీర్, కుమార్, కేశరామ్, లింగన్న, వీరు పాక్షి రెడ్డి, శివ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అల్లీపీరస్వామి దర్గాలో...

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో శ్రీ అల్లీపీరస్వామి దర్గాను ఆదివారం సాయంత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుట్టా నీలకంఠ దర్శించుకొని మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా నీలకంఠ, వై. రుద్రగౌడ్‌లకు దర్గా ట్రస్టి ప్రెసిడెంట్ గురు గాజిహుసేన్‌పీరాం శాలువాలు కప్పి సన్మానించారు. బుట్టా నీలకంఠ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతికగా అల్లీపీరస్వామి దర్గా నిలుస్తుందని చెప్పారు. ప్రజలందరూ బాగుండాలని ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అమహ్మద్, రాష్ట్ర మేథావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కేఆర్. లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు ఎంకె. శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యుకె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.